
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 29 డిసెంబరు 2024



వైకుంఠ ద్వారానికి రంగులు



ముస్తాబవుతున్న భద్రాద్రి

» ఎల్లుండి నుంచే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
» సర్వాంగ సుందరంగా పుణ్యక్షేత్రం » తుది దశకు చేరుకున్న పనులు

6



పాలేరుకు కల్పతరువు

» భక్తరామదాసు ప్రాజెక్టుతో మూడు మండలాల్లోని భూములు సస్యశ్యామలం
» ఎకరా భూమి రూ.50లక్షలు పైమాటే » మంత్రి తుమ్మల కృషి ఫలితం

6

లంచగొండి
ఆటకట్టు

» ఏసీబీ వలలో దమ్మపేట సర్వేయర్ మెరుగు వెంకటరత్నం
» రైతు నుంచి రూ.50వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత
» భూమి సర్వే రిపోర్టు ఇవ్వడానికి లంచం వేధింపులు
» విసిగివేసారి ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
» పక్కాప్లాన్ ప్రకారం 'ఆపరేషన్'.. దమ్మపేటలో సంచలనం
» మంత్రి పొంగులేటి హెచ్చరించినా మారని తీరు



ఏసీబీకి పట్టుబడ్డ దమ్మపేట రెవెన్యూ సర్వేయర్ వెంకటరత్నం

దమ్మపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అతడు ఓ సర్వేయర్. భూములకు కీలకమైన హద్దులు నిర్ణయించే టెక్నికల్ పర్సన్. కానీ లంచాలకు మరిగి కొన్నేళ్లుగా రైతులను ఇబ్బంది పెడుతున్నాడు. చివరకు అతడి పాపం పండింది. ఏసీబీకి అడ్డంగా దొరికిపోయి కటకటాల వెనక్కి వెళ్లాడు. భూమి సర్వే కోసం దరఖాస్తు చేస్తే, రకారకాల సాకులు చెబుతూ తిప్పించుకోవడమే కాకుండా, చట్టాలు, నిబంధనలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడాడు. చివరకు ఎలాగోలా సర్వే చేసినా రిపోర్టు ఇవ్వకుండా మెలిక పెట్టాడు. లంచం ఇస్తేగాని పని పూర్తికాదని చెప్పడంతో బాధితుడు ఏసీబీకి పట్టించాడు. ఈ ఘటన దమ్మపేటలో శనివారం జరిగింది. ఏసీబీకి దొరికిపోయిన లంచగొండి పేరు.. మెరుగు వెంకటరత్నం. దమ్మపేట సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ వెల్లడించిన వివరాలిలా వున్నాయి... ఖమ్మంకు చెందిన మద్దినేని వెంకట్ సోదరి మమతకు దమ్మపేట రెవెన్యూలో సర్వేనెంబర్ 1458లో 19ఎకరాల 20కుంటల (మిగతా 6వ పేజీలో)



గాయపడిన అశోక్

అల్లుడిపై మామ దాడి

» తన కూతురును ప్రేమ వివాహం చేసుకున్నాడని ఆగ్రహం
» పక్కాప్లాన్‌తో ఆస్పత్రికి పిలిపించి దాడి
» తీవ్రంగా గాయపడిన అశోక్
» తమకు రక్షణ కల్పించాలని బాధితుడి భార్య వేడుకోలు

ఖమ్మం క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తనకు ఇష్టం లేకుండా తన బిడ్డను ప్రేమ వివాహం చేసుకున్నాడనే కోపంతో అల్లుడి తలపై ఓ వ్యక్తి స్పిరిట్ సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం ఖమ్మం నగరంలో జరిగింది. గాయపడ్డ వ్యక్తి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం సమీపంలోని సీతల తండాకు చెందిన గుగులోత్ అశోక్ నగరంలోని ఓ మొబైల్ షాపులో పని చేస్తున్నాడు. అతడికి తొమ్మిది నెలల క్రితం నేలకొండపల్లి మండలం చెరువుమాధారం సమీపంలోని (మిగతా 6వ పేజీలో)

» చోరీల్లో 50 శాతం, ఆర్థిక మోసాల్లో 63 శాతం పెరుగుదల
» రూ.35 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు
» ఈ ఏడాది 26 హత్యలు, 70 లైంగిక దాడి కేసులు
» వార్షిక నివేదిక విడుదల చేసిన సీపీ సునీల్‌దత్
» గత ఏడాదితో పోల్చితే ఎక్కువ సంఖ్యలో నమోదైన నేరాలు



నేరాల జోరు

జిల్లాలో విస్మయం కలిగిస్తున్న 2024 క్రైం రేట్

నేరాల జోరుకు 2024 వేదికగా నిలిచింది. ఖమ్మం జిల్లా పరిధిలో ఈ సంవత్సరం క్రైం రేట్ భారీగా పెరిగింది. చోరీలు, మోసాలు, ఆర్థిక నేరాలు, సైబర్, మహిళలకు సంబంధించిన నేరాలు.. ఇలా ఒకటేమిటి ప్రతీ అంశంలోనూ నేరాల సంఖ్య భారీగా పెరిగింది. 2023తో పోల్చుకుంటే ఈ ఏడాదిలో నేరాల పెరుగుదల 50 శాతానికి పైగానే ఉంది. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ సంవత్సరం 17,056 ఫిర్యాదులు వచ్చాయి. వాటిల్లో 16,961 ఫిర్యాదులను పరిష్కరించగా 8,873 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే కమిషనరేట్ పరిధిలో 13,153 ఫిర్యాదులు రాగా 13,148 ఫిర్యాదులను పరిష్కరించారు. 7,667 ఫిర్యాదులకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ ఏడాది మొత్తం 26హత్యలు జరగ్గా, కుటుంబ కలహాల నేపథ్యంలో 11, వివాహేతర సంబంధాల నేపథ్యంలో 5 జరిగాయి. ఆర్థిక నేరాలకు సంబంధించి ఈ సంవత్సరం 727 కేసులు నమోదయ్యాయి. వాటిలో 397 మోసం కేసులు, 19 ఫోర్జరీ కేసులున్నాయి. ఇక మహిళలకు సంబంధించి 70 లైంగిక దాడి కేసులు, 101 కిడ్నాప్, 17 ఈవ్‌టీజింగ్, 322 వేధింపుల కేసులు నమోదయ్యాయి.

ఖమ్మం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో క్రైం రేట్ పెరిగింది. 2023తో పోల్చితే ఈ సంవత్సరం నేరాల సంఖ్య భారీగా పెరిగింది. అన్ని రకాల నేరాల్లోనూ ఈ పెరుగుదల కనిపించింది. ప్రత్యేకంగా సైబర్ మోసాలు ఈ సంవత్సరం ఎక్కువగా నమోదయ్యాయి. ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం వార్షిక క్రైం నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం ఖమ్మం కమిషనరేట్ పరిధిలో గతేడాదికంటే 50 శాతం చోరీ కేసులు పెరిగాయి. 2023లో 466 చోరీ కేసులు నమోదుకాగా ఈ సంవత్సరం ఆ సంఖ్య 700కు పెరిగింది. ఈ కేసుల్లో 295 కేసులను ఛేదించారు. మొత్తం రూ.5.58 కోట్ల చోరీ జరగగా, రూ.1.55 కోట్లు రికవరీ చేశారు. ఇక ఈ ఏడాది 32 చైన్‌స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఇక ఈ ఏడాది మొత్తం 26హత్యలు జరగగా, వాటిలో 11హత్యలు కుటుంబ కలహాల నేపథ్యంలో జరగ్గా, 5 హత్యలు వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగాయి. ఆర్థిక నేరాలు గతేడాదితో పోల్చితే 63శాతం పెరిగాయి. గతేడాది 446 కేసులు నమోదుకాగా ఈ సంవత్సరం ఆ సంఖ్య 727కు చేరింది. వాటిల్లో 397 మోసం కేసులు, 19 ఫోర్జరీ కేసులు ఉన్నాయి.

రూ.5.8కోట్ల జరిమానా..

2023లో 701 ప్రమాదాలు జరగ్గా 213 మంది మరణించారు. 648 మంది గాయపడ్డారు. ఈ ఏడాది 785 ప్రమాదాలు జరగ్గా 271 మంది మరణించగా 629 మంది గాయపడ్డారు. పోలీసుశాఖ ద్వారా ఈ ఏడాది 3.28లక్షల చలాన్లు విధించగా రూ.5.8కోట్ల జరిమానా విధించారు. గతేడాది 6,358 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు (మిగతా 6వ పేజీలో)

మహిళా సంబంధ కేసులు..

మహిళలకు సంబంధించి గతేడాది 780 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 858 కేసులు నమోదయ్యాయి. వీటిలో 5 వరకట్న కేసులు, 13హత్యలు, 70 లైంగిక దాడి కేసులు, 101 కిడ్నాప్, 17 ఈవ్‌టీజింగ్, 322 వేధింపుల కేసులు ఉన్నాయి. వ్యభిచారానికి సంబంధించి ఈ సంవత్సరం 9 కేసులు నమోదయ్యాయి. మహిళల మిస్సింగ్‌కు సంబంధించి గతేడాది 438 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 558 కేసులు నమోదయ్యాయి. వీరిలో 357మందిని గుర్తించారు. పురుషులకు సంబంధించి 179 మందికిగాను 152 మందిని గుర్తించారు. చిన్నారుల మిస్సింగ్‌కు సంబంధించి 129 కేసులు నమోదయ్యాయి. 90మందిని గుర్తించారు.



భక్త సమ్మేళనం సందర్భంగా సత్తుపల్లిలో భారీ ర్యాలీ

దృఢసంకల్పం, పవిత్ర ఆశయంతో
సత్ఫలితాలు

» ప్రపంచానికి స్వామి వివేకానంద జ్ఞానభిక్ష పెట్టారు...
» రామకృష్ణ మిషన్ బాధ్యులు స్వామి బోధమయానందజీ, స్వామి శితికంఠానందజీ
» సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల 6వ భక్త సమ్మేళనం

6



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

మనిషి ఉన్నంత వరకు
కమ్యూనిజం

» కష్టజీవులకు ఎల్లవేళలా అండ
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
» మణుగూరులో పినపాక నియోజకవర్గ సర్వసభ్య సమావేశం
» రామానుజారంలో అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ

మణుగూరు/మణుగూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రపంచంలో మనిషి ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని, పేదలకు అండగా నిలిచేది అది ఒక్కటేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరులోని పూజారినగర్‌లో శనివారం నిర్వహించిన సీపీఐ పినపాక నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదల పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, డబ్బున్న పార్టీలు కాలగర్భంలో కలిశాయని, కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల వసంతంలో అడుగు పెట్టి సంబరాలను జరుపుకొంటున్నదన్నారు. కార్మికులు, కర్షకులు, కష్టజీవులకు కష్టం వస్తే ఎర్ర జెండాను పిలుస్తారని, కలుస్తారని తెలిపారు. స్థానిక నాయకులైన పెద్దబ్బాయి, అయోధ్య లాంటి వారికి ఇబ్బందులు ఎన్నో ఎదురయ్యాయని, అయినా వారు పార్టీని వీడలేదని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు సిద్ధాంతానికి మరణం లేదని, (మిగతా 6వ పేజీలో)

ధృఢసంకల్పం, పవిత్ర ఆశయంతో సత్ఫలితాలు

రామకృష్ణమిషన్ బాధ్యులు స్వామి బోధమయానందజీ, స్వామి శితికంఠానందజీ

సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల 6వ భక్త సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన విద్యార్థినులు

సత్తుపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఏకాగ్రత, ధ్యానంతో విద్యార్థి తన జీవితంలో గొప్ప విజయాలు అందుకునేందుకు సాధ్యపడుతుంది.. తరగతి గదిలోనే నైపుణ్యాభివృద్ధిని మెరుగు పరచుకుంటే భవిష్యత్‌లో దేశం ముందుకు వెళ్తుందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ, విజయవాడ రామకృష్ణ మిషన్ బాధ్యుడు స్వామి శితికంఠానందజీలు అన్నారు. రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ (తెలంగాణ) ఆధ్వర్యంలో సత్తుపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించే 6వ వార్షిక భక్త సమ్మేళనం శనివారం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా విద్యార్థి సమ్మేళనంలో వారు ప్రసంగిస్తూ వివేకానంద భారత ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటారని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వివేకానందుని స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మనసులో ఆధ్మాత్మిక వెలుగును నింపుకోవాలని, ధృఢ సంకల్పం, పవిత్ర ఆశయం కలిగి ఉంటే సత్ఫలితాలు సాధించవచ్చునన్నారు. రేపటి యువతరమైన ఇప్పటి విద్యార్థులు స్వామివివేకానందుడిని చదవాలని, పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని స్వీకరించి ఏకగ్రతను పెంచుకోవాలని సూచించారు. 3శాతం బ్రెయిన్‌ను మాత్రమే మనం ఉపయోగిస్తున్నామని, కనీసం 10శాతం వినియోగించినా యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే అవకాశం దక్కుతుందన్నారు.



సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ ఓర్పు తర్వాత వచ్చే విజయం చాలా గొప్పదని, ఎన్నో అపజయాలను ఎదుర్కొని తాము ఈ స్థాయికి వచ్చేందుకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు. తాము ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓడినప్పటికీ ప్రజల పక్షాన నిత్యం పోరాడుతూ వచ్చామని, ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఇప్పుడు మీ ముందు ఇలా ప్రజాప్రతినిధిగా గెలిపొందామని గుర్తు చేశారు.

అంతకముందు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మాధురి ఫంక్షన్‌హాల్ వరకు ఏర్పాటు చేసిన విద్యార్థుల ర్యాలీని ఎమ్మెల్యే రాగమయి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సాగిన యువ సమ్మేళనం, భక్త సమ్మేళనంలో శ్రీ రామకృష్ణ వివేకానంద భావజాలం-జీవితచరిత్రపై సాంస్కృతిక కార్యక్రమం, త్రివిక్రమరాము బృందంచే త్రాచుపాము నోట్లో పడ్డ కప్ప లఘునాటకం, పేరిణీ శివతాండవం అలరించగా ప్రతిభా పరీక్షలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నిర్వహకులు చీకటి శ్రీనివాసరావు, దేవులపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి, గట్టే వాసు, చల్లగుళ్ల అప్పారావు, రాజ రత్నాచారిలతో పాటు ప్రయివేట్ విద్యాసంస్థల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న భద్రాద్రి

- ఎల్లుండి నుంచే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
- సర్వాంగ సుందరంగా పుణ్యక్షేత్రం.. తుది దశకు చేరుకున్న పనులు



గోదావరి వారధి వద్ద స్వాగత ద్వారం

భద్రాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల ఆరంభానికి మరో రెండు రోజులే మిగిలింది. ఇప్పటికే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. రామాలయం ప్రాకారాలకు రంగులు, చలువ పందిళ్లతో చాందినీ వస్త్రాలంకరణ పూర్తయ్యింది. విద్యుదీపాలంకరణ చేపట్టారు. మిథిలా స్టేడియంలో బ్రహ్మోత్సవాల సమయంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికకు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 31 నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా దశావతార అలంకారాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 9, 10తేదీల్లో గోదావరి నదీ తీరంలో స్వామి వారి తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు సంబంధించిన టికెట్ల విక్రయాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇప్పటికే ప్రారంభమై ఊపందుకుంటున్నాయి. గోదావరి వారధి, స్నానఘట్టాలకు వెళ్లే మార్గం, సూపర్‌బజారు సెంటర్, కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. కాగా గోదావరి నదీ తీరంలో జనవరి 9న నిర్వహించనున్న స్వామివారి తెప్పోత్సవానికి సంబందించి హంసాలంకృత తెప్ప పనులు వేగంగా సాగుతున్నాయి.

రామయ్యకు రూ.40లక్షల విలువైన

రత్నాంగి కవచం

- సమర్పించిన హైదరాబాద్‌కు చెందిన భక్తులు
- నేడు రత్నాంగి సేవలో భద్రాద్రి రామయ్య



ఈవోకు అందిస్తున్న పిన్నమనేని బాలమురళీకృష్ణ కుటుంబం

భద్రాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి రత్నాలతో పొదిగిన రత్నాంగి కవచాన్ని హైదరాబాద్‌కు చెందిన భక్తులు పిన్నమనేని బాలమురళీకృష్ణ, శాంతి దంపతులు సమర్పించారు. రూ.40లక్షల విలువైన 51 వేల రత్నాలతో పొదిగిన ఈ రత్నాంగి కవచాన్ని శనివారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవితో పాటు ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్యులకు అందజేశారు. అనంతరం రత్నాంగి కవచానికి సంప్రోక్షణ, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఆదివారం మూలవరులకు పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం స్వామివారికి రత్నాంగి కవచాన్ని అలంకరించనున్నారు. ఆదివారం భక్తులు రత్నాంగి సేవలో శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ముఖ్య అర్చకులు కోటి విష్ణు వర్ధనాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎన్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను ప్రజలకు చేరువ చేయాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి



మాట్లాడుతున్న వీరభద్రస్వామి

పాల్వంచ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా పోస్టల్‌శాఖ చేపట్టు పలు సేవలను, అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి. వీరభద్రస్వామి అన్నారు. శనివారం పాల్వంచ పోస్టల్ కార్యాలయంలో డివిజన్‌స్థాయి పోస్టల్ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ప్రిమియంతో అందే జీవితభీమా పథకాలకు సంబంధించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే మనం అనుకున్న లక్ష్యాలను సాదించగలమని తెలిపారు. ఈ కార్యకర్మంలో పాల్వంచ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీరన్న, ఐపీపీబి మేనేజరు సంజయ్, మెయిల్ ఓవర్సీస్ దుర్గా ప్రసాద్, పాల్వంచ సబ్‌పోస్ట్‌మాస్టర్ నాగమణి షా, బ్రాంచి పోస్ట్‌మాస్టర్ ఎల్లారావు, తిలక్, రామారావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

లంచగొండి ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

భూమి వుంది. ప్రస్తుతం ఆమె అమెరికాలో ఉంటోంది. ఆమె భూములను సర్వే చేసేందుకు రెండు నెలల క్రితం వెంకట్ దరఖాస్తు చేసారు. ఈ క్రమంలో నెలరోజుల క్రితం మండల సర్వేయర్ మెరుగు వెంకటరత్నంను కలిశాడు. భూములను సర్వేచేసి రిపోర్ట్‌ను ఇచ్చేందుకు సర్వేయర్ రకరకాల సాకులతో ఇబ్బందులకు గురిచేసాడు. అనంతరం రూ.1.50 లక్షలు ఇస్తే సర్వే రిపోర్ట్ ఇస్తానని చెప్పాడు. దీంతో వెంకట్ ఏసీబీ అధికారులును ఆశ్రయించారు. పూర్తిగా విచారణ జరిపిన ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్ వేశారు. వారి సూచన మేరకు.. వెంకట్ శనివారం సర్వేయర్ వెంకటరత్నంకు ఫోన్ చేశారు. డబ్బులు ఇస్తానని తెలిపారు. దీంతో సర్వేయర్ తాను ముష్టిబండ గ్రామ సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు వస్తానని, అక్కడ కలుసుకుందామని చెప్పాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన వెంకట్ నుంచి సర్వేయర్ రూ.50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిని దమ్మపేట తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారించారు. సర్వేయర్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా, సర్వేయర్ వెంకటరత్నం అన్నపురెడ్డిపల్లిలో నివాసం ఉంటూ అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. శనివారం విధులకు రాకపోయినా వెంకట్‌తో జరిగిన ఒప్పందం మేరకు డబ్బులు తీసుకోవడానికి ప్రత్యేకంగా అక్కడకు రావడం గమనార్హం.

మంత్రి పొంగులేటి హెచ్చరించినా..

దమ్మపేట రెవెన్యూ అధికారులపై అనేక ఆరోపణల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడవద్దంటూ హెచ్చరించారు. కొందరు రైతులకు ఫోన్ చేసి అధికారుల పనితీరుపై ఆరా తీశారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇది జరిగి రెండురోజుల కాకముందే సర్వేయర్ రూ.50వేలు లంచంగా తీసుకుంటూ పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా రెవెన్యూశాఖ మంత్రి హెచ్చరించినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాకపోవడం విస్తుగొలుపుతోంది.

అందుకే ఏసీబీకి పట్టించా...

మద్దినేని వెంకట్, ఫిర్యాదుదారుడు



సర్వే చేయకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా, లంచం డిమాండ్ చేయడం వల్లే తాను సర్వేయర్ వెంకటరత్నంను ఏసీబీకి పట్టించానని బాధితుడు మద్దినేని వెంకట్ తెలిపారు. అమెరికాలో ఉండే తన సోదరి మమతకు దమ్మపేటలో 19 ఎకరాల 20 కుంటల భూమి వుందని, రెండు నెలల క్రితం సర్వేకోసం దరఖాస్తు చేశామని తెలిపారు. కానీ నెలరోజులుగా సర్వేయర్ రకరకాల సాకులు చెబుతూ వచ్చాడని, తమ వద్ద అన్ని సప్లిమెంటరీ సేత్వార్, సర్టిఫైడ్ కాపీలు ఉన్నాయని చెప్పినా ఆయన వినిపించుకోలేదని తెలిపారు. ఆరేళ్లుగా ఇక్కడ సర్వేయర్‌గా పనిచేస్తున్న వెంకటరత్నంకు సర్వే చట్టాలకు సంబంధించిన కనీస జ్ఞానం కూడా లేదని వెంకట్ చెప్పారు. చివరకు సర్వే అనంతరం రికార్డు కనిపించటం లేదని చెబుతూ, రూ.1.50 లక్షలు లంచం ఇస్తే రిపోర్టు అప్పగిస్తానని చెప్పాడని పేర్కొన్నారు. దీంతో విసిగి వేసారి తాను ఏసీబీకి ఫిర్యాదుచేశానని తెలిపాడు. డబ్బులు తీసుకొని కూడా పని చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటాడని వెంకట్ వెల్లడించారు. తనలాగా ఇతర రైతులు ఇబ్బందులు పడకూడదనే ఏసీబీకి పట్టించినట్టు వెల్లడించారు.



ల్యాప్‌టాప్‌లో ఎంపీ రఘురాంరెడ్డికి వివరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఎంపీ నిధుల వినియోగంపై..

కమిషనర్‌తో ఎంపీ రఘురాంరెడ్డి భేటీ

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుల నిధులతో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే విషయంపై ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో భేటీ అయ్యారు. శనివారం ఎంపీ రఘురాంరెడ్డి ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయానికి వచ్చి కమిషనర్‌తో కొద్ది సేపు సమీక్షించారు. ఖమ్మం నగరంలోని రైల్వే లైన్‌కు ఇరువైపుల అభివృద్ధి కార్యక్రమాలు, ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా నగరం అభివృద్ధి కార్యాచరణపై ఎంపీకి కమిషనర్ ల్యాప్‌టాప్‌లో వివరాలను చూపుతూ భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణను వివరించారు.

పాలేరుకు కల్పతరువు

మూడు మండలాల్లోని భూములు సస్యశ్యామలం చేస్తున్న భక్తరామదాసు ఎత్తిపోతల పథకం

అపర భగీరథుడు మంత్రి తుమ్మల కృషి ఫలితం

కూసుమంచి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత చేపట్టిన తొలి నీటిపారుదల ప్రాజెక్టు భక్తరామదాసు ఎత్తిపోతలు.. జిల్లాలోనే అత్యంత కరువు ప్రాంతానికి నీరందించాలనే సంకల్పంతో అప్పటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసింది. కరువు ప్రాంతంగా ఉన్న పాలేరు నియోజకవర్గానికి కల్పతరువుగా మారింది. వరుసగా ఎనిమిదో ఏడాది కూడా పంటపొలాలకు సాగర్‌నీరు అందిస్తోంది. 2016లో నిర్మాణం పూర్తయిన ఈ ప్రాజెక్టును 2017 జనవరి 30న నాటి సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. అప్పటినుంచి ప్రతిఏడాది రెండు సీజన్‌లలో పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లోని చెరువులను, కుంటలను నింపడంతో ధాన్యపు రాశులు పండుతున్నాయి. ప్రస్తుతం యాసంగి సీజన్‌లోనూ చెరువుల్లో పుష్కలంగా నీరు నిల్వ ఉంటుండటంతో రైతులు వరి సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది మరో 5వేల ఎకరాలకు సాగునీరు

భక్తరామదాసు ఎత్తిపోతల ద్వారా తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండా వద్ద నుంచి కూసుమంచి మండలంలోని గట్టుసింగారం వరకు సుమారు 30వేల ఎకరాల వరకు సాగర్‌నీరు అందుతోంది అయితే గతంలో భూసేకరణలో కొంత సమస్యలు తలెత్తగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని పరిష్కరించారు. దాంతో చేగొమ్మ ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా చేగొమ్మ, గోపాలపురం, ముత్యాలగూడెం, తల్లంపాడు గ్రామాలకు సాగునీరు అందుతోంది. అదేవిధంగా కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయం వెనుక కూడా భూసేకరణ సమస్య పరిష్కారమైంది.దీనిద్వారా గుర్వాయిగూడెం, జుజ్జులరావుపేట, వాల్యాతండ, పాలేరు గ్రామాల వరకు నీరందుతోంది. సమస్య పరిష్కారం కావడంతో మరో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. రైతులు తూముల ద్వారా, వాగుల ద్వారా పంటపొలాలకు నీళ్లను తరలించుకుంటున్నారు.

ఎకరా భూమి రూ.50 లక్షలు పైమాటే..

ఒకప్పుడు పంటలు సరిగా పండకపోవడంతో పాలేరు నియోజకవర్గంలోని చాలా గ్రామాల ప్రజలు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఊళ్లలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇక్కడి కూలీలు సరిపోకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాలనుంచి ఇక్కడకు నాట్లు వేసేందుకు, మెట్ట పైర్లలో కలుపులు తీసేందుకు కూలీలు వస్తున్నారు. చెరువులు నిండి ఉండటంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో బోర్ల ఆధారంగా సాగుచేసే అన్నదాతలకూ నీటి చింత తీరింది. చెరువుల నుంచి నీరు వస్తుండటంతో చేతి నిండా నీరు దొరుకుతుండటంతో రైతులు తమకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కలిగిందంటున్నారు. ఒకప్పుడు వర్షాధారంగా చెరువు నిండితేనే కొందరు రైతులు సాగు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. భక్తరామదాసు పుణ్యమా అని పాలేరు నియోజకవర్గంలో భూముల రేట్లు విపరీతంగా పెరిగాయి. రూ.3లక్షల నుంచి రూ.4లక్షలున్న ఎకరం భూమి ప్రస్తుతం రూ.50లక్షలకు పెరిగింది. కూసుమంచి మండలం గైగొళ్లపల్లి గ్రామంలో ఇటీవల అత్యధికంగా ఎకరం భూమి రూ.40లక్షలకు కొనుగోలు చేయడంతో గ్రామస్థులు అవాక్కయ్యారు. రెండు పంటలు పండుతూ, నిత్యం సాగర్ జలాలు వస్తుండటంతో భూముల రేట్లు అమాంతం పెరిగాయని రైతులు తెలిపారు. భక్తరామదాసు పుణ్యమాని భూగర్భజలాలు తగ్గడంలేదని, చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయని తెలిపారు.



ఆయకట్టులో వరిసాగు



జీళ్లచెరువులో సాగర్ జలాలతో నిండిన పోచారం పెద్ద చెరువు

అల్లుడిపై మామ దాడి

(5వ పేజీ తరువాయి)

అజయ్ తండాకు చెందిన బాణోత్ మానసతో మొబైల్ షాపు వద్ద పరిచయం ఏర్పడింది. మానస హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా వీరు కొద్ది నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం మూడు నెలల క్రితం మానస తండ్రి వెంకటేశ్వరరావుకు తెలియడంతో కూతురును మందలించాడు. అయినా వారు భయపడకుండా నవంబరు 8న మహబూబాబాద్ జిల్లాలోని బలపాలలోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. తరువాత ఇద్దరూ కుసుమంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి పోలీసులు ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి, ఇద్దరూ మేజర్ కావడంతో వారిని ఏమీ అనవద్దని కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే తన కూతురును అశోక్ చదివించాలని తండ్రి వెంకటేశ్వరరావు షరతు పెట్టాడు. ఇందుకు ఒప్పుకున్న అశోక్ ఆమెను చదివిస్తానని మాట ఇచ్చాడు. ఇటీవల మానసకు కడుపులో చిన్న కణితి ఏర్పడి నొప్పితో బాధపడుతుండటంతో అశోక్ ఆమెను ఖమ్మం నగరంలోని ఓ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. మానస తల్లిదండ్రులు ఉంటేనే ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు. దీంతో మానస తన దగ్గరి బంధువు అయిన బాలాజీ అనే వ్యక్తికి ఈ విషయం చెప్పి తల్లిదండ్రులను రావాలని చెప్పింది. అయితే బాలాజీ గత నాలుగు రోజులుగా మానసకు ఫోన్ చేస్తూ ఖమ్మం ఎన్ఎస్‌టీ రోడ్డులో ఉన్న ఆస్పత్రికి రావాలని, అక్కడికి వస్తే ఆమె తల్లిదండ్రులు వచ్చి ఆపరేషన్ చేయిస్తారని తెలిపాడు. దీంతో శనివారం మధ్యాహ్నం మానస తన భర్తతో కలిసి సదరు ఆసుపత్రి వద్దకు వచ్చింది. వీరిని చూసిన మానస తండ్రి వెంకటేశ్వరరావు ఒక్కసారిగా ఆస్పత్రి రిసెప్షన్ వద్ద ఉన్న స్పిరిట్ సీసాతో అశోక్ తలపై బలంగా కొట్టాడు. ఇద్దరినీ చంపుతానని కేకలు వేయడంతో అక్కడున్న వారంతా అతడిని అడ్డుకున్నారు. రక్తపు మడుగులో పడిపోయి ఉన్న అశోక్‌ను వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా రు. అక్కడి వైద్యులు అతడిని పరీక్షించి గాయం బలంగా తగిలిందని చెప్పడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. కాగా అశోక్‌కు సర్జరీ చేయగా 30 కుట్లు పడినట్టు అతడి భార్య మానస తెలిపింది. ఈ విషయంపై ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణను వివరణ కోరగా ఘటనపై తమకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాకు ప్రాణహాని ఉంది...

తన తండ్రితో తమకు ప్రాణహాని ఉన్నదని మానస 'ఆంధ్రజ్యోతి'కి తెలిపింది. గుగులోత్ అశోక్‌తో ప్రేమ విషయం తెలియడంతో అప్పుడే చచ్చిపొమ్మని చెప్పాడని పేర్కొంది. హాస్టల్‌లో ఉన్న సమయంలో ఎప్పుడైనా తనకు ఆరోగ్యం బాలేదని చెబితే, ట్రీట్‌మెంట్ కూడా చేయించేవాడు కాదని, పైగా ఎవరికీ లేని సమస్య నీకు ఎందుకు వస్తున్నది అంటూ తిట్టేవాడని తెలిపింది. అశోక్‌ది, తనది ఒక్కటే కులం అయినప్పటికీ ఆస్తి లేని వాడితో ప్రేమ, పెళ్లి వద్దని తిట్టేవాడని, తన తండ్రి నుంచి తమకు రక్షణ కల్పించాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మానస విన్నవించింది.

నేరాల జోరు

(5వ పేజీ తరువాయి)

నమోదుకాగా ఈ ఏడాది 2,095 కేసులు నమోదు చేశారు.

సైబర్ నేరాలు...

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సాధారణ దొంగతనాల్లో జరిగిన నష్టంకంటే సైబర్ నేరాల ద్వారా ప్రజలు పోగొట్టుకున్నది పదింతలు అధికంగా ఉంది. గత ఏడాది 1,332 సైబర్ మోసాల కేసులు నమోదవ్వగా ఆయా నేరాల్లో బాధితులు రూ.9కోట్లు పోగొట్టుకున్నారు. కానీ ఈ ఏడాది 2,148 సైబర్ నేరాల కేసులు నమోదు కాగా 1,820 కేసులకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా నేరాల్లో బాధితులు రూ.34.92 కోట్లు నష్టపోగా పోలీసులు రూ.2.42కోట్లను బ్యాంకుల ద్వారా హోల్డ్‌లో ఉంచారు. రూ.52.13లక్షలను రికవరీ చేశారు. గడిచిన రెండేళ్లలో సాధారణ దొంగతనాల్లో ప్రజలు నష్టపోయిన సొమ్ము రూ.10కోట్లు ఉండగా.. సైబర్ నేరగాళ్లు ఈ ఒక్క ఏడాదిలోనే కొట్టేసిన సొమ్ము రూ.34.92కోట్లు ఉండటం గమనార్హం.

ఇతర కేసులు...

పోలీసులు నమోదు చేసిన కేసుల్లో కోర్టుల ద్వారా ఈ ఏడాది 4,398కేసులకుగాను 2002 కేసుల్లో నేరస్థులకు శిక్షలు పడ్డాయి. లోక్ అదాలత్ ద్వారా 18,224 కేసులు పరిష్కరించారు. ఈ సంవత్సరం జిల్లాలో ఇద్దరికి ఐదేళ్ల శిక్ష, ఒకరికి పదేళ్లు, నలుగురికి 20ఏళ్ల శిక్ష పడగా.. ఇద్దరికి జీవిత ఖైదు పడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల విషయానికొస్తే గతేడాది 605కేసులు నమోదుకాగా ఈ ఏడాది 702 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఎన్డీపీఎస్‌కు సంబంధించి 41 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 35 కేసులు నమోదయ్యాయి. డయల్ 100కు గతేడాది 40,519 కాల్స్ రాగా ఈ ఏడాది 48,008కాల్స్ వచ్చాయి. గత ఏడాది ముగ్గురిపై పీడీ యాక్ట్ ప్రయోగించగా ఈ సంవత్సరం ఐదుగురిపై పీడీయాక్ట్ ప్రయోగించారు.

నేరాల తీరు	2023	2024	వ్యత్యాసం	పెరిగిన శాతం
దొంగతనాలు	466	700	234	50.2
హత్యలు	28	26	-2	--
ఆర్థిక నేరాలు	446	727	281	63
మహిళా సంబంధిత నేరాలు	780	858	78	10
ఎస్సీ/ఎస్టీ కేసులు	82	94	12	14.63
రోడ్డు ప్రమాదాలు	701	785	84	11.9
మిస్సింగ్ కేసులు	438	558	120	27.3
ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు	605	702	97	16
ఎన్డీపీఎస్ కేసులు	41	35	-6	---
సైబర్ నేరాలు	1332	2148	816	61

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహ్మాన్.. అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రెహమాన్

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తనిఖీలు, గస్తీ నిర్వహిస్తూ రౌడీ షీటర్లు, సస్పెక్టల కదిలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ స్థానిక పోలీసు అధికారి, సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయిత్రం ఆయన అన్నపురెడ్డిపల్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది టర్నవుట్, కిట్లు పరిశీలించి పరేడు నిర్వహించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కోడి పందాలు, పేకాట రాయుళ్లపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని కోరారు. ఇదే సమయంలో సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మనిషి ఉన్నంత వరకు కమ్యూనిజం

(5వ పేజీ తరువాయి)

కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, లలిత, బి.అయోధ్య, మున్నా లక్ష్మికుమారి, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, రాంగోపాల్, పుల్లారెడ్డి, వివిధ మండలాల పార్టీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన మణుగూరు

సీపీఐ శత జయంతి వేడుకల్లో భాగంగా మణుగూరు పట్టణం సీపీఐ జెండాలతో ఎరుపెక్కింది. మండలంలోని రామానుజారం గ్రామంలో అమరవీరుల స్మారక స్థూపాన్ని శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. రాష్ట్ర నేత బాగం హేమంతరావు పార్టీ జెండాను ఎగుర వేశారు. రామానుజారం నుంచి కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. కాంగ్రెస్‌కు చెందిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా వచ్చి ర్యాలీకి సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెంచాలి

- టీ హబ్‌కు శాంపిల్స్ పంపిస్తున్నారా?
- వైద్యఆరోగ్య సంచాలకుడు రవీంద్రనాయక్
- మామిళ్లగూడెం పీహెచ్‌సీ తనిఖీ



మామిళ్లగూడెం పీహెచ్‌సీని సందర్శించిన డీహెచ్ రవీంద్రనాయక్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు28:ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు పెంచాలని తెలంగాణ వైద్యఆరోగ్య సంచాలకుడు డాక్టర్ బి.రవీంద్రనాయక్ చెప్పారు. శనివారం ఆయన ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. పీహెచ్‌సీలోని గదులను, ఫార్మసీలో బిన్‌కార్డ్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు సరిపడా మందులను, అవుట్ పేషెంట్ రిజిస్టర్ ప్రకారం బ్యాలెన్స్ ఉందా లేదా పరిశీలించారు. ల్యాబ్‌లో రోజుకు ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు అని ఆరాతీశారు. టీహబ్‌కు శాంపిల్ పంపిస్తున్నారా అని అడిగారు. బెడ్‌లను పరిశీలించి పేషెంట్‌తో మాట్లాడారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు, అర్బన్‌హెల్త్‌సిబ్బందితో సమీక్షించారు. వైద్యాధికారి, స్టాఫ్ నర్స్ ఫార్మాసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్, డీఈవోల విధులు,ఏ విధమైన సేవలు అందిస్తున్నారో అడిగారు. అనంతరం మాతా శిశు సంక్షేమంలో ఎర్లీ రిజిస్ట్రేషన్, ఏఎన్‌సీ చెకప్, అనీమియా గుర్తింపు, బర్త్ ప్లాన్ గురించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసే విధానం ప్రోగ్రాం అధికారికి సూచనలు చేశారు. సంక్రమణ వ్యాధుల పట్ల విస్తృత సేవలు అందించాలన్నారు. టీబీని అరికట్టడంలో సిబ్బంది నివారణ కార్యక్రమాలు జరిపి, ప్రతీ ఇంటికి వెళ్లి అన్ని కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీకార్యక్రమం విజయవంతం కావాలంటే ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఈసీ) ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలలోకి ప్రతి కార్యక్రమాన్ని తీసుకొని వెళ్లి అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రతీ ఉద్యోగీ నిర్దేశించిన పనిని చేయటంలో అలసత్వంవద్దని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి కళావతిబాయి, ప్రోగ్రాం అధికారులు సైదులు, చందునాయక్, రామారావు, వెంకటరమణ, డెమో సాంబశివరెడ్డి, యూపీహెచ్ వైద్యులు చైతన్య పాల్గొన్నారు

ఉత్సాహంగా సీఎం కప్ వాలీబాల్ పోటీలు



ఖమ్మంస్పోర్ట్స్‌డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన లీగ్ పోటీలు నువ్వా నేనా అన్నట్లుగా సాగాయి. ఆదివారం సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. పోటీను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ పలువురు సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

బాలుర విభాగంలో

ఖమ్మం జట్టు ఆదిలాబాద్ జట్టుపై 25-23, 25-16, 25-23 (3-0) స్కోరు తేడాతో విజయం సాధించగా, మహబూబ్‌నగర్ జట్టు నిజామాబాద్ జట్టుపై 25-18, 25-17, 25-15 (3-0) స్కోరు తేడాతో, మెదక్ జట్టు నల్గొండ జట్టుపై 21-25, 25-22, 25-19, 25-12 (3-1) స్కోరు తేడాతో, కరీంనగర్ జట్టు హైదరాబాద్ జట్టుపై 30-28, 25-18, 25-12 (3-0) స్కోరు తేడాతో, రంగారెడ్డి జట్టు హైదరాబాద్ జట్టుపై 25-15, 25-14, 25-20 (3-0)తో విజయం సాధించాయి.

బాలికల విభాగంలో

నల్గొండ జట్టు హైదరాబాద్ జట్టుపై 25-14, 25-09, 25-15 (3-0) స్కోరు తేడాతో విజయం సాధింగా, వరంగల్ జట్టు ఆదిలాబాద్ జట్టుపై 25-08, 25-13, 25-15 (3-0) స్కోరు తేడాతో, నిజామాబాద్ జట్టు రంగారెడ్డి జట్టుపై 25-20, 25-09, 25-13 (3-0) స్కోరు తేడాతో, కరీంనగర్ జట్టు మెదక్ జట్టుపై 25-20, 25-16, 25-12 (3-0) స్కోరు తేడాతో, ఖమ్మం జట్టు రంగారెడ్డి జట్టుపై 25-12, 25-10, 25-21 (3-0) స్కోరు తేడాతో, మహబూబ్‌నగర్ జట్టు మెదక్ జట్టుపై 25-21, 25-15, 25-10 (3-0) స్కోరు తేడాతో విజయం సాధించాయి.

తెల్లదోమతో రైతుల ఆందోళన

- పామాయిల్, కొబ్బరి పంటలకు తీవ్ర నష్టం
- అశ్రద్ధ చేస్తే భారీ నష్టమంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు
- నివారణ చర్యలకు సూచనలు



కొబ్బరిలో తెల్లదోమ ఉధృతి

అశ్వారావుపేట, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యాన పంటలు, నర్సరీలు, విదేశీ పంటలకు ప్రాముఖ్యత పొందింది. నేలస్వభావం, తగినంత నీటివసతులు, సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండటం,కష్టపడే రైతులు ఉండటంతో పంటల దిగుబడి అధికంగా ఉంటోంది. ముఖ్యంగా పామాయిల్, కొబ్బరి,కోకో,వక్క వంటి పంటలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 60వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వాస్తవంగా వీటికి తెగుళ్లు తక్కువగా ఉంటాయి. ఇటీవల ఈతోటలకు నల్ల ముట్టెపురుగు, ఎర్రముక్కు పురుగు, ఐరియోపెడ్ నల్లితో పాటు సర్పిలాకార తెల్లదోమ కూడా అధికంగా ఉంది.దీంతో ఉద్యాన పంటల రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పామాయిల్, కొబ్బరి తోటలను ఈ పురుగు ఆశిస్తోంది. వేల ఎకరాల్లో విస్తరించిన ఉద్యాన పంటలకు ఈతెల్లదోమ, ఇతర పురుగులు ఉధృతి శాపంగా మారింది. ఈదోమ, పురుగును గుర్తించడం, నివారణ, నష్టాలను అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జీ.విజయకృష్ణను వివరించారు. ఈ దోమ చాలాత్వరితగతిన విస్తరిస్తుందని, అశ్రద్ధ చేస్తే మొక్క చనిపోతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆయన తెలిపారు.

తెల్లదోమతో నష్టాలు

సర్పిలాకార తెల్లదోమ పామాయిల్, కొబ్బరి వంటి ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ దోమ శాస్త్రీయ నామం అల్యూరోడికస్ రుగ్యుమ్ పరుక్యూలేటస్, అల్యురోడిస్ అను కుటుంబానికి చెందింది. దీని జీవిత చరిత్ర పరిశీలిస్తే తల్లి పురుగులు ఆకుల అడుగుభాగంలోసర్పిలాకారంలో లేతగోధుమ రంగు లేత ముదురు పసుపు రంగులో ఉండే గుడ్లను పెడుతుంది. ఈ పురుగు ఐదు దశల్లో వృద్ధి చెందుతుంది. మామూలు దోమకన్నా ఐదురెట్లుపెద్దదిగాఉంటుంది.(సుమారు 2.5మీమీ). దీని జీవిత చక్రం 30 రోజుల్లో పూర్తవుతుంది.

లక్షణాలు

ఆకుల అడుగుభాగాలపై సర్పిలాకార తెల్లటి వలయాలను ఏర్పరచి, తెల్లటి దూదివంటి పదార్థంతో నిండి ఉంటుంది. తేనె లాంటి జిగురు పదార్థం ఆకుల అడుగుభాగం నుంచి కింద ఆకులపై పడుతుంది. తద్వారా ఆకులు నల్లటి మసి మంగుతో కప్పబడి ఉంటాయి.

నష్టం

తెల్లదోమ మొక్క ఆకుల కింద ఆశించి రసాన్ని పీల్చి, తేనెలాంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తుంది. ఈ జిగురు ఆకులపై పడి మసి నంగువలన కిరణజన్య సంయోగ క్రియకు ఆటంకం జరుగుతుంది. తద్వారా ఆకులు త్వరగా మాడిపోతాయి. ఫలితంగా దిగుబడి అధికంగా నష్టపోతాయి. మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుంది.

తెల్లదోమ నివారణ చర్యలు ఇలా..



తెల్లదోమపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జీ.విజయకృష్ణ తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతులను వర్షాకాల అనంతరం లేదా దోమఉధృతి పెరగక ముందు నుంచే పాటించాలన్నారు. కిందిసూచనలు పాటిస్తే దోమఉధృతి తగ్గుతుందన్నారు.

- పసుపురంగు కలిగిన జిగురు అట్టలను చెట్లకు కట్టడం ద్వారా దోమ ఈ అట్టలకు అతుక్కోని పోయి ఉధృతి తగ్గుతుంది
- మిత్రపురుగైన ఎన్‌కార్సియా గడ్బలోపే అను బదనికలను తోటలో విడుదల చేయాలి. వీటిని విడుదల చేసిన 6నుంచి 8నెలల్లో ఈ బదనికలు దోమను అదుపులోకి తీసుకొస్తాయి
- అజాడికర్టిన్ 10,000 పీపీఎం1మి.లీ/ లేద 0.5% వేపనూనె, 5-10 గ్రా.సర్ఫ్, లీటరు నీటిలో కలిపి ఆకు అడుగు భాగాలు పూర్తిగ తడిసేలా పిచికారీ చేయాలి.
- ఎటువంటి క్రిమి సంహారక మందులు తోటలలో పిచికారీ చేయరాదు. ఈరసాయనాలతో మిత్రపురుగులు తోటల్లో నశిస్తాయి.
- మసి నంగు నివారణకు 1%గంజి ద్రావణాన్ని మసి ఆశించిన భాగాలపై పిచికారీ చేయాలి
- దఫాలుగా 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేస్తే తెల్లదోమను అదుపు చేయవచ్చు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్



ఖమ్మంక్రైం,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వస్తున్న ట్రాక్టర్.. ఆటోను వెనక నుంచి ఢీకొట్టింది.ఈసంఘటన శనివారంరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. చింతకాని మండలం రామకృష్ణాపురంవైపు నుంచి ఖమ్మానికి ట్రాలీ ఆటో ఖాళీగా వస్తోంది. ఈక్రమంలో నగర శివారులోని ధంసలాపురం సమీమంలోకి రాగానే ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసమైంది. ఆటోలోని డ్రైవర్‌కు కూడా గాయాలు అయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను ఓ ఆసుపత్రికి తరలించారు.

ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్

ఖమ్మంక్రైం,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):ఖమ్మంవన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వేడుక వద్ద ట్రాన్స్‌జెండర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ శనివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై ప్రజలకు ఇబ్బందులు కలిగేలా డబ్బులు వసూల్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ట్రాన్స్‌జెండర్స్‌కు హెచ్చరించారు.

డీజే పెట్టిన వారిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): భారీశబ్దాలతో డీజేలు పెట్టిన వారిపై కేసు నమోదు చేసినట్టు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నగరానికి చెందిన కొర్లపాటి నాగరాజు, కృష్ణా జిల్లా ఖమ్మంపాడు గ్రామానికి చెందిన ములకపాటి శివరాజ్ అనుమతులు లేకుండా నగరంలోని ఓ స్కూల్ సమీపంలో శుక్రవారం అర్థరాత్రి డీజేలతో డాన్సులు నిర్వహించారు. దీంతో వారిపై కేసు నమెదు చేశారు. కోర్టులో హాజరుపరిచినట్టు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రామదాసు ధ్యాన మందిరంలో కచేరి



పూజలు చేస్తున్న వరప్రసాద్

నేలకొండపల్లి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసుజన్మస్థలమైన నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో శనివారం కంచి కామకోటి ఆ స్థాన సంగీత విద్వాంసుడు వరప్రసాద్ కచేరి నిర్వహించారు. చెన్నై నుంచి వచ్చిన వరప్రసాద్ తొలుత ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నమాచార్య, త్యాగరాజు,రామదాసు కీర్తనలను ధ్యాన మందిరంలో గానం చేశారు. అర్చకుడు సౌమిత్రి రమేష్‌తో పాటుగా భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

బూర్గంపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందగా, ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సం ఘటన మోరంపల్లిబంజర గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బీహార్ రాష్ట్రం బైర్లారిమిలి ప్రాంతానికి చెందిన సుధీర్ దాస్(38), ప్రదీప్‌దాస్‌తో పాటు మరి కొంతమంది వ్యక్తులు బూర్గంపాడు మండల పరిధిలోని మర్రికుంట గ్రామశివారులో గల ఓ ఫ్యాక్టరీలో పని చేసేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం సమయంలో సుధీర్ దాస్, ప్రదీప్‌దాస్ కూరగాయల కోసం మోరంపల్లిబంజర గ్రామంలో జరిగే వారపు సంతకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వారిని ఢీకొట్టింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భద్రాచలం తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో, ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో సుధీర్‌దాస్ మృతి చెందాడు. ప్రదీప్‌దాస్ ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కావడంతో క్షతగాత్రుడిని పాల్వంచ తరలించారు. శనివారం ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ సూరి సత్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..!

- రాకాసితండాలో రాళ్లకుప్పలుగా మారిన పంట పొలాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఆకేరులో రాళ్లతో నిండిన పొలాలు(ఫైల్)

తిరుమలాయపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సృష్టించిన వరద బీభత్సానికి మండలంలోని రాకాసితండా అతలాకుతలం అయింది. గత సెప్టెంబరు నెలలో ఆకేరు వరద బీభత్సానికి రాకాసితండా మొత్తం మునిగిపోయింది. పలు ఇళ్లుకూలిపోయాయి. పంట పొలాలు పనికిరాకుండా పోయాయి. ఎటుచూసినా రాళ్లకుప్పలతోనే దర్శనమిస్తున్నాయి. ఈఘటన జరిగి నెలలు గడుస్తున్నా వారికి అరకొరక సాయం మాత్రమే అందింది. తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినా ఎవరు పట్టించుకోలేదు. ప్రభుత్వం ఇల్లు కూలిన వారికి వారికి రూ.16వేలు, పంట ఇసుక మేటలు వేసిన వారికి రూ.10వేల వంతున ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఈగ్రామస్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాకాసితండా ఆకేరు వరద ముంపు వాసుల బాధలు తీరడంలేదు. ఆకేరువరదతో గ్రామంలో ఇళ్లు, వాకిలి, పంట పొలాలు కొట్టుకుపోయాయి. పంటలు ఇసుక మేటలు వేసి పనికిరాకుండా పోయాయి. ఇళ్లలోని సామన్లు సైతం మొత్తం కొట్టుకుపోయాయి. పొలాల్లో వేసిన ఇసుకమేటలు వేసి ఎందుకు పనికి రాకుండా పోయాయి.. ఒక్కో కుటుబానికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. రైతులు సాగుచేసిన పత్తి, మిర్చి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో తండావాసులు ఆర్థిక సాయం అందక ఎదురుచూస్తున్నారు. గ్రామంలో సుమారు వందల ఎకరాల్లో పంటలనష్టపోయినట్టు వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. అలాగే ఇళ్లు, పశువులు కొట్టుకుపోయాయి. వీరికి కూడా కొంతమందికి మాత్రమే నష్టపరిహారం అందింది. పూర్తిస్థాయిలో సాయం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కూలిపోయిన ఇళు

ఉపాధి కోసం అవస్థలు

ఆకేరు వరదకు గురై రాకాసితండా గ్రామంలోని ఐదు కుటుంబాలకు చెందిన రైతుల పొలాలు వరదల్లో నష్టపోయాయి. సారవవంతమైన వ్యవసాయ భూముల్లో ఇసుకమేటలతో పాటు రాళ్లకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రెండు పంటలు పండే సాగుభూములు సాగుచేయడానికి పనికిరాకుండా పోయాయి. అట్టి భూములు మళ్లీ సాగుచేసుకునే విధంగా తయారు చేయాలంటే ఎకరానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. కాగా రాకాసితండా వాసులను కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు కేంద్రబృందం సభ్యులు పర్యటించినా పూర్తిస్థాయిలో సహాయం అందలేదు. దీంతో పనులు లేక రైతులు కూలీలుగా మారి బతుకుదెరువుకు ఇతర ప్రాంతాలకు పనులకు వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీవ్రంగా నష్టపోయినా తమను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం ఎస్సీబీనగర్ ప్రాంతానికి చెందిన భూక్యా రవి(34) పాల వ్యాపారాన్ని 2020 సంవత్సరం నుంచి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు..?

ఖమ్మం క్రైం డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పరిధిలో గంజాయి విక్రయిస్తున్న పలువురిని శనివారం రాత్రి ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో నిఘా పెట్టి పలువురి పట్టుకున్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి కొంత గంజాయి కూడా స్వాధీనం చేసుకుని వారిని ఖనాపురం హవేలీ పోలీసులకు అప్పగించి, పూర్తి వివరాలు సేకరించేందుకు విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భద్రాచలంలో నేటి నుంచి నెహ్రూకప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు



పిచ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం నుంచి జనవరి 5 వరకు నెహ్రూకప్ అంతరాష్ట్ర క్రికె ట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీ ల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్ గఢ్ నుంచి మొత్తం 21 జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీ విజేతలకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.30వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లను అంద జేయనున్నారు. ఇందుకోసం భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని సిద్ధం చేశారు. ఈ నెహ్రూకప్ క్రికెట్ పోటీలను 29వసారి నిర్వహిస్తున్నారు.

ఐదుగురు మావోయిస్టు దళ సభ్యుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ లొంగిపోయిన వారి వివరాలను ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన పూనెం పాక్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన వెట్టి దేవ అలియాస్ బాలు, చర్ల మండలం చెన్నాపూరం గ్రామానికి చెందిన మడకం ఉంగి, అలియాస్ గంగి, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇర్రవల్లి గ్రామానికి చెందిన రవ్వ సోమ, అదే పోలీస్‌స్టేషన్ పరధిలోని రాసపల్లి గ్రామానికి చెందిన మడివి గంగి లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. పూనె పాక్లి 2016లో సీఎన్ఎం సభ్యురాలిగా మావోయిస్టు పార్టీలో చేరి 2018 దళ సభ్యురాలిగా, 2022లో బాసగూడె ఎల్‌వోఎస్ ఏరియాకమిటీ సభ్యురాలిగా ఉన్నతి పొందింది. ఈమె పలు విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు. ఆమెపై రూ.4లక్షలు రివార్డు ఉంది. వెట్టిదేవ అలియాస్ బాలు 2018లో మావోయిస్టు పార్టీలో చేరి చర్ల ఎల్‌వోఎస్‌కి బదిల అయ్యాడు. ఛత్తీస్‌గడ్‌లో 24మంది భద్రత సిబ్బంది చనిపోయిన దాడిలో ఇతడు కీలకంగా వ్యవహరించినట్లు ఎస్పీ తెలిపారు. మడకం ఉంగి అలియాస్ గంగి 2018లో సీఎన్ఎం సభ్యురాలిగా మావోయిస్టు పార్టీలో చేరి చర్ల ఏరియాలో పని చేస్తోందని తెలిపారు. రవ్వ సోమ 2010లో బాలల సంఘంలో సభ్యురాలుగా చేరి అనంతరం 2017 నుంచి 2021 వరకు దళ సభ్యురాలుగా పామేడు ఏరియా సౌత్‌బస్తర్‌లో పని చేసినట్లుగా ఎస్పీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున జిల్లా పోలీసులు కల్పిస్తున్న సౌకర్యాలను గ్రహించి జన జీవన స్రవంతిలో కలిసి మెరుగైన జీవనం గడపాలని నిర్ణయించుకుని లొంగిపోయిన వారు ప్రకటించినట్లు ఎస్పీ తెలిపారు.

108కేజీల సారా బెల్లం పట్టివేత

అశ్వాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిచ్చుకలపాడు తండా సమీపంలోని అటవీప్రాంతంలో కొందరు వ్యక్తులు నాటుసారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ మణుగూరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. పిచ్చుకలపాడు తండాకు చెందిన బదావత్ కోటేశ్వరరావు, కొత్తగూడెం పెద్దబజారుకు చెందిన సంజయ్‌లడ్డా ఇరువురు కొంత కాలంగా కొత్తగూడెం నుంచి నాటుసారా తయారీకి వినియోగించే ముడిపదార్థాలను పిచ్చుకలపాడు అటవీప్రాంతానికి తీసుకు వస్తున్నారు. సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పారిపోయారు. పట్టుబడ్డ వ్యక్తి నుంచి ట్రాలీతో పాటు 108 కేజీల బెల్లం, 5కేజీల పటిక, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి తెలిపారు. కాగా దాడుల్లో ఎస్ఐలు గౌతమ్, కిషోర్‌బాబు, సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్‌పాషా, గురువయ్య, సుమంత్, రమేష్, ప్రసన్న, ప్రీను, అమల పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్



జూలూరుపాడులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో ఖుర్షీద్

జూలూరుపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటి వరకు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ తెలిపారు. శనివారం జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఎరువుల నిల్వలను పరిశీలించి యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఇప్పటి వరకు మండలంలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సీఈవో రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ. 89.56కోట్ల డబ్బులు జమచేసినట్లు తెలిపారు. రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నట్లయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 31వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తామన్నారు. జిల్లాలోని 20 సహకార సంఘాల పరిధిలో ఈ ఏడాది 123 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జూలూరుపాడు సొసైటీ ద్వారా గోల్డ్ రుణాలను ఇచ్చేందుకు సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. సంఘాలలో గోదాంల నిర్మాణాలకు నాబార్డ్ ద్వారా నిధుల మంజూరుకై ప్రతిపాదనలను పంపించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ మధు, సీఈవో రమణారెడ్డి, సిబ్బంది నున్నా సునిత, సాయి తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ నగర కమిటీ నియామకం



శ్రీనివాస్, యశ్వంత్

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత సంఘం నగర కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శిలుగా శ్రీనివాస్, యశ్వంత్‌లను నియమించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యక్షుడిగా నసీర్, ప్రసాద్, సహాయ కార్యదర్శిలుగా చంద్రశేఖర్, వెంకటేష్, కోశాధికారిగా ప్రణయ్‌తో పాటుగా మరో 9మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	18 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	34
పచ్చిమిర్చి	38
కాకరకాయ	38
బెండకాయ	40
పొట్లకాయ	38
దోసకాయ	38-38
చిక్కుడు	54
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	20
దొండ	54-60
సొరకాయ	20
క్యారెట్	38
క్యాప్సికం	58
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	25

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

విరిగిన కుర్చీలతో ప్రయాణికులకు ఇబ్బందులు

» కామేపల్లికి చెందిన ఓ ప్రయాణికుడికి గాయాలు
» చెప్పినా పట్టించుకోని అధికారులు



నూతన బస్టాండ్‌లో విరిగిన కుర్చీలు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుర్చీలు విరిగి పోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ తరువాత అంతటి బస్టాండ్‌ను ఖమ్మంలో నిర్మించారు. ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కోసం బస్టాండ్‌లో ఏర్పాటు చేసినకుర్చీలు వారంరోజులుగా ఇరిగి ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కామేపల్లికి చెందిన ఓ ప్రయాణికుడు తన గ్రామానికి వెళ్లెందుకు నూతన బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు మరో అర్థగంట సమయం పడుతుందని తెలిసి బస్టాండ్‌లో ఉన్న కుర్చీలో కూర్చోగా అతను కింద పడిపోయాడు. వెంటనే డ్యూటీలో ఉన్న అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ప్రయాణికుడు తెలిపాడు. ప్రయాణికుడికి స్వల్ప గాయం అయినట్లు తెలిపాడు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు కుర్చీలు మార్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ అన్నారు. శనివారం మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెను ప్రకారం అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు.సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఖమ్మంరూరల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తల్లంపాడు ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సీఎంఓ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, పులిపాటి నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

గడువులోపు ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

» కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
» సర్వే బృందాలతో సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): గడువులోగా ఇందిరమ్మ సర్వేను పూర్తి చేయాలని సర్వే బృందాలకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మార్గదర్శకం చేశారు. శనివారం సాయంత్రం సర్వే బృందాలతో కేఎంసీలో కమిషనర్ అభిషేక్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సర్వే ప్రాంతాలపై ముందస్తుగా ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఖచ్చితమైన సమాచారం మాత్రమే సేకరించాలని, ఒక్కో నివాసంలో ఎంత మంది సభ్యులు ఉంటున్నారు. ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయో ఖచ్చితంగా తెలుసుకొని నమోదు చేయాలని సూచించారు. సొంత భవనంలో ఉంటున్నారా లేదా అద్దె భవనంలో ఉండేది నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రతీ నివాసం వద్ద ఫొటోలు, డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వార్డు ఆఫీసర్లుకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, ఆర్వో జీ శ్రీనివాసరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

మాధవరావుకు మాస్‌లైన్ నివాళులు

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల రాష్ట్రనాయకుడు గొర్రెపాటి మాధవరావుకు మాస్‌లైన్ నాయకులునివాళులర్పించారు.ఆయన శనివారం నిజామబాద్‌లో మృతి చెందారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఓప్రకటన విడుదల చేశారు. నిజాంబాద్ జిల్లాలో న్యాయవాది వృత్తిని చేస్తూ ప్రజలు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదుల హక్కులు కోసం పని చేశారని, జిల్లాతోను మంచి సంబంధాలు కొనసాగించారని గుర్తు చేశారు.

సీపీఎం నాయకుడి మృతి

ఖమ్మంరూరల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరెకోడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సిలివేరు కృష్ణయ్య (90) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బండి పద్మ, నండ్రా ప్రసాద్, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

6లోపు వృత్తి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

» జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): జనవరి6లోపు మైనారిటీలు వృత్తి శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కే. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో అర్హులై మైనార్టీలు (ముస్లిం, సిక్కు, బౌద్ధులు, జైనులు పార్శీలు) నుంచి వివిధ రంగాల్లో వృత్తి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 18నుంచి 35సంవత్సరాలలోపు, ఇంటర్ ఆపైన చదివిన అర్హులై మైనార్టీలు హార్డ్వేర్ అండ్ నెట్వర్కింగ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ రంగాల్లో మూడు నెలల శిక్షణ కొరకు దరఖాస్తులు సమర్పించాలని, మైనారిటీల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 9704003002లో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమే

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో రానున్న రోజుల్లో బీసీల రాజ్యమే వస్తుందని బీసీరాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. శనివారం నగరంలోని పూలే అంబేద్కర్ అధ్యయన కార్యాలయంలో బీసీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళానేత కొండా పద్మ, సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని, రాష్ట్ర కార్యదర్శి మంజులారాజేందర్, న్యాయవాది విజయశాంతి, ఖమ్మం ఇన్‌చార్జ్ పొడగంటి రాంబాబుచారి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి బ్యాంకుకు 'ఐఎస్‌వో'సర్టిఫికెట్



ఐఎస్‌వో సర్టిఫికెట్ చూపుతున్న చెరుకూరి క్రిష్ణమూర్తి

ఖమ్మంవ్యవసాయం,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో విస్తరించిన భద్రాద్రిబ్యాంకు ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను సాధించింది. క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసే ప్రముఖ సంస్థ అయిన హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ సంస్థ భద్రాద్రి బ్యాంకు వ్యాపార వ్యవహారాలను పరిశీలించింది. బ్యాంకు అంతర్గత, ఆర్బీఐ పాలసీలను, మేనేజ్మెంట్, ఎంప్లాయిస్ పని చేయు విధానాన్ని అంచనా వేసింది. ఖాతాదారులకు అందిస్తునన పలుసేవలను దృష్టిలో పెట్టుకొని ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్ జారీ చేసింది. చైర్మన్ చెరుకూరి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఇది ప్రతీఒక్కరి సహకారంతో సాధ్యపడిందని అన్నారు.

కేఎంసీ ఆర్ఐ కూరపాటికి స్థాన చలనం

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కూరపాటి శ్రీనివాసరావుకు స్థాన చలనం జరిగింది. మరిపెడ మున్సిపల్ కార్యాలయం మేనేజరుగా నియమిస్తూ శనివారం సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు

ఖమ్మం రూరల్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.ఈసంఘటన ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి పరిధిలోని కోతుల గుట్ట వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం అజ్మీరా తండా గ్రామానికి చెందిన భర్మావత్ సందీప్, ఖమ్మం రూరల్ మండలం, తెల్దారుపల్లి గ్రామానికి చెందిన భూక్యా అజయ్ స్నేహితులు. వీరు ఇద్దరు సందీప్ ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి తెల్దారుపల్లి వెళుతున్నారు. రూరల్ మండలం, మద్దులపల్లి పరిధిలోని కోతుల గుట్ట వద్ద అతివేగంగా వెళుతూ ముందు వెళుతున్న మద్దులపల్లి గ్రామానికి చెందిన వెంకటబాబు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో రెండు ద్విచక్రవాహనాలపై వెళుతున్న ముగ్గురు కిందపడగా వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సందీప్, అజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.జరిగిన సంఘటనపై బాధితుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి

» కేయూ పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్



పరీక్షల తీరును పరిశీలిస్తున్న రాజేందర్

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అన్నారు. శనివారం నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరుగుతున్న ఎంఫార్మసీ సెకండ్ సెమిస్టర్ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష సమయంలో విద్యార్థులు నకిలీలు, మాస్ కాపీయింగ్ పాల్పడకుండా పర్యవేక్షకులు కట్టుదిట్టం చేయాలన్నారు. అధ్యాపకులు,, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయాలి ఆదేశించారు.

కర్ణాటక తరహా లోకాయుక్త అవసరం

» టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపూడి

ఖమ్మంలీగల్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కర్ణాటక తరహా లోకాయుక్త అవసరం ఉందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు అన్నారు. రాష్ట్రంలో నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న అవినీతి అక్రమాలపై ఆందోళన వ్యక్తంచేస్తూ గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. కర్నాటకలో రామకృష్ణ హెగ్డె ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొత్తగా తెచ్చిన లోకాయుక్త చట్టం అవినీతిపరుల భరతం పట్టిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఈ చట్టానికి సమూల మార్పులు చేసి కర్టాటక తరహాలో స్వయం ప్రతిపత్తికలిగిన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కల్లూరు, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గల బత్తుపల్లి గామంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై శనివారం ఎస్‌ఐ నివేదిత తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సంఘటనలో ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.7,300 నగదును స్వాధీన పరుచుకున్నారు. నిందితుల్లో ఎనిమిది మంది పరారయ్యారు. ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.వారంతా కల్లూరు మండలానికి చెందిన వారని తెలసింది. ఈ మేరకు ఎస్‌ఐ నివేదిత నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇవ్వాలి

» జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

ఖమ్మంటౌన్, డిసెంబరు28: ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలుఇవ్వాలని, లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని తెలంగాణా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వేంకటేశ్వరరావు కోరారు. శనివారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మంచికంటి మీటింగ్‌హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పొన్నం వేంకటేశ్వరరావు మాట్లాడుతూ భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. కానీ నేడుఉపాధిలో వందరోజులు పని చేసిన వారికే ఈ పథకం వర్తిస్తుందని ప్రకటించటం సరికాదన్నారు. లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారో ఇంతవరకు విధివిధానాలు రూపొందించకపోవటం, దీనిపై వివిధ రకాల ప్రచారాలు వస్తున్నాయని, దీంతో గందరగోళం నెలకొన్నదన్నారు.లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసిన వారికే ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించటం లబ్ధిదారులను తగ్గించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో పని కల్పించటం లేదని, కొత్తజాబ్‌కార్డులు ఇవ్వటం లేదన్నారు. అందుకే వ్యవసాయ కార్మికులు ఇతర పనులకు వెళుతున్నారన్నారు. ఈ విషయమై ఈనెల 30న కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు తాటి వేంకటేశ్వర్లు, పగిడిపల్లి ఏసు, మెరుగు రమణ, బండి పద్మ, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బీవీకే. చైర్మన్ శ్రీనివాసరావు, ప్రవీణ్, ఎస్‌కే.మీరాపాల్గొన్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

» తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్‌గౌరవ అధ్యక్షుడు నరేందర్



తిరుమలాయపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రామస్వరాజ్య వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్‌గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని తెట్టెలపాడులో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలో పేర్కొన్న 29 అంశాలను పంచాయతీలకు బదిలీచేయాలన్నారు. పంచాయతీలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు అధికారాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా వాటిని ఇతర ప్రాధాన్యత కార్యక్రమాలకు మళ్లిస్తూ స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బకాయిలన్నీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల గురించి సీఎం రేవంత్‌రెడ్డి ఆయాశాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమలో మాజీ సర్పంచ్ పుసులూరి మంజుల, తుపాకుల నాగేశ్వరరావు, పుసులూరి పుల్లయ్య, పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం విజయవంతం



చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి

నేలకొండపల్లి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండ్రాజుపల్లిలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరం విజయవంతమైంది. 50 గేదెలకు కృత్రిమ గర్భధారణకు చికిత్స అందించారు. 50 దూడలకు నట్టల నివారణ మందును తాగించారు. కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన నిర్వహించారు. ఎక్కువ పాలిచ్చే గేదేలకు బహుమతులను అందచేసారు. డాక్టర్ భువనేష్‌కుమార్ మాట్లాడుతూ పాడి గేదెల పెంపకందారులు ఎప్పటికప్పుడు పశువైద్యుల సూచనలు, సలహాలను తీసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. సూపర్‌వైజర్ శంకరయ్య, గోపాలమిత్రలు తాజ్‌పాషా, నరేష్, పాండురంగయ్య, వెంకటేశ్వర్లు, వెంకటప్రసాద్ చికిత్సలో సహకరించారు. కార్యక్రమంలో రైతులు నెల్లూరి వెంకటేశ్వర్లు, అప్పారావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు ఘన నివాళి

తిరుమలాయపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు శనివారం సుబ్లేడులో కాంగ్రెస్ పార్టీనేతలు ఘననివాళులర్పించారు. రతన్‌టాటా జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో టాటా లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ మేనేజర్ రమేష్, శ్రీకాంత్, సతీష్, కాంగ్రెష్ నాయకలు శ్యాంసుందర్‌రెడ్డి, మెట్టు అనిల్‌కుమార్,యుగంధర్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ



గంగారం గ్రామ పంచాయతీని పరిశీలిస్తున్న శ్రీజ

సత్తుపల్లిరూరల్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్వహణలో ఎవరైనా అలసత్వంగానీ ప్రదర్శి స్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పీ.శ్రీజ హెచ్చరించారు. శనివారం మండలంలోని గంగారం గ్రామంలో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు సర్వే సమయంలో అడిగిన సమాచారం, డాక్యుమెంట్లు, సర్వేకు వస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లతో సహకరించి అడిగిన పూర్తి సమాచారం తెలపాలని అన్నారు. అప్పుడే సమాచార సేకరణ త్వరగా పూర్తవుతుందని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రాకుండా, లక్ష్యం మేరకు ప్రతిరోజూ సర్వేపూర్తి చేయాలని, ప్రస్తుత స్థితిగతి తెలుసేలా ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, డాక్యుమెంట్ల ప్రకారం యాప్‌లో ప్రతి కాలమ్ సరిగ్గా పూరించాలని అధికారులకు సూచించారు. 100శాతం ఇండ్ల పన్నుల వసూళ్లు చేయాలి అనంతరం గంగారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలలో ఇండ్ల పన్నుల వసూళ్ల 100శాతం నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, వసూలైన నగదును వెంటనే జీపీ ఖాతాలలో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. క్యాష్ బుక్స్ రికార్డులను ఖచ్చితంగా నిర్వహిస్తూ ప్రజా అవసరాలు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఖమ్మంటౌన్, డిసెంబరు28: ఖమ్మం నియోజకవర్గ పరిధిలో అర్హులైన వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లస్థలాలు, స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ఒకేసారి రూ.5లక్షలు ఇవ్వాలని శనివారం సీపీఎం ఖమ్మం డివిజన్‌కమిటీ ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు చేసినవారిలో కొంతమందివి ఆన్‌లైన్ చేయకపోవటంతో వారిని సర్వే చేయటం లేదని కమిషనర్‌కు వివరించారు.వెంటనే నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి, అర్హులైనవారు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించి వాటిని కూడా ఇందిరమ్మ పథకం కింద సర్వే నిర్వహించాలని కోరారు. 10ఏళ్లుగా రేషన్ కార్డుల జారీ లేకపోవటంతో అర్హులైనా ఇందిరమ్మ పథకం వర్తించటం లేదన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కొంతమంది రాజకీయ నాయకులు హడావుడి చేస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా అర్హులకు పథకం వర్తింపచేయాలని విక్రమ్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ. జబ్బార్, ఎస్. నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, షేక్ మీరాసాహెబ్, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, నగరనాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

ప్రేమకు, ప్రపంచశాంతికి క్రీస్తు సందేశం ఆచరణీయం

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రేమకు, ప్రపంచశాంతికి క్రీస్తు సందేశం సదా ఆచరణీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్ ప్రేమవిందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఏసుక్రీస్తు తన ప్రజల కోసం మరణించాడని, తిరిగి జీవించాడని, అందుకే క్రిస్మస్‌ను అత్యంత ప్రవిత్రంగా జరుపుకునే పండుగ అంటారన్నారు. నియోజకవర్గంలోని పాస్టర్లకు ఇళ్లు, ఇళ్లస్థలాల కల్పన, ఉపకార వేతనాలు, మండల కేంద్రాలలో క్రిష్టియన్ భవనాల నిర్మాణం చేపడతామని, పాస్టర్లంతా ఐక్యంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డి, తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, నాయకులు, కార్యకర్తలు, పాస్టర్లు పాల్గొన్నారు.

మధిర బస్టాండ్‌లో
మురుగు సమస్య తీరేదెన్నడో..

» దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
» పట్టించుకోని అధికారులు



బస్టాండ్ కు వెళ్లే దారిలో నిలిచిన మురుగునీరు

మధిరటౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మధిరలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మురుగునీటి సమస్య మూడు సంవత్సరాలైన పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లలోని నీరు అంతా మరుగుదొడ్ల వెనక ఉన్న ఖాళీ ప్రదేశంలోకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది, ఆ నీరు అంతా బస్సులో బయిటకు వెళ్లే ప్రదేశంలో నిలబడటంతో బస్సులు బయటకు వెళ్లే క్రమంలో ఆ మురుగు నీరు చిమ్మి ఆ మార్గంలో వెళ్లే వాహనాలతో పాటు బాటసారులపై పడుతుంది. బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు నిండటంతో మురుగునీరు అక్కడకు చేరటంతో పాటు డ్రైనేజీ లేక పోవడం వల్ల మురుగునీరు పోయే దారి లేక సమస్య ఉత్పన్నం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై డిపో అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

అప్పటి రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బస్టాండ్ సమీపంలో ట్యాంక్‌బండ్ ప్రారంభానికి వచ్చినప్పుడు స్థానికులతో పాటు నాయకులు ఆయన దృష్టికి కూడా మురుగు నీరు విషయాన్ని తీసుకువెళ్లారు. బస్టాండ్ ముఖ ద్వారం వైపు డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడం వల్ల మురుగునీరు పోయే మార్గం లేకుండా పోయిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకురావడంతో ఆయన డ్రైనేజీ నిర్మాణంతో పాటు బస్టాండ్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అప్పటి వరకు మురుగునీరు నిలిచిన ప్రదేశంలో మట్టి తోలించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఇది జరిగి రెండేళ్లు అయినా డ్రైనేజీ నిర్మించింది లేదు, సమస్యకు పరిష్కారం లభించింది లేదు.

ఇప్పటికైనా అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలని బస్టాండ్ పరిసర ప్రాంత ప్రజలతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ డీఎం దేవదానాన్ని వివరణ కోరగా సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయించాము, డ్రైనేజీ కాల్వలు లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచిపోతుంది. త్వరలో మధిరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రానుంది కాబట్టి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

బస్టాండ్ ఆవరణంతా అస్తవ్యస్తంగా ఉంది

● కోనా జగదీష్, ప్రయాణికుడు

మురుగునీరు బస్టాండ్ ప్రాంగణంలో నిలిచి ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. మురుగుదొడ్ల లోపలకంటే బయటే అధ్వానంగా ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ సమస్య అపరిష్కృతంగా ఉంది, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వాలి

» ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) ముదిరాజ్‌లను రాజకీయంగా, సంక్షేమ పరంగా, ప్రభుత్వ పదవుల్లో ప్రాధాన్యతనివ్వాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు కోరారు. కల్లూరులో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర కాల్యెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఐక్యతకు, అభ్యున్నతికి తమ వంతుగా పాటు పడుతామన్నారు. ప్రభుత్వం తరుపున చేపట్టనున్న సంక్షేమా అభివృద్ధి కార్యక్రమాల్లో ముదిరాజ్‌లకు తగిన అవకాశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం కల్లూరు మండల అధ్యక్షుడు చింతకాయల వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్ లింగాల నారాయణ, మారబోయన శ్రీనివాస్, మేరుగు వేలాద్రి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిరికంటి వెంకటేశ్వర్లుకు గానకోకిల అవార్డు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

కొణిజర్ల, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన నకిరికంటి వెంకటేశ్వర్లును ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట సంస్థ వారు సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉద్యమ గాన కోకిల అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డును మాజీ శాససభ్యుడు చాడ వెంకటరెడ్డి, పీపుల్స్ మూమెంట్ సంస్థ వ్యవస్థాపకుడు మేకల చంద్రశేఖర్‌యాదవ్‌ల చేతులు మీదగా అందజేశారు. కాగా వెంకటేశ్వర్లు ఉద్యమ, జానపద గీతాలను ఆలపిస్తూ ఉంటాడు. మండలంలో పలువురు ఆయనను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ



గంగారం గ్రామ పంచాయతీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్వహణలో ఎవరైనా అలసత్వంగానీ ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ హెచ్చరించారు. శనివారం మండలంలోని గంగారం గ్రామంలో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు సర్వే సమయంలో అడిగిన సమాచారం, డాక్యుమెంట్లు, సర్వేకు వస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లతో సహకరించి అడిగిన పూర్తి సమాచారం తెలపాలని అన్నారు. అప్పుడే సమాచార సేకరణ త్వరగా పూర్తవుతుందని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రాకుండా, లక్ష్యం మేరకు ప్రతిరోజూ సర్వేపూర్తి చేయాలని, ప్రస్తుత స్థితిగతి తెలుసేలా ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, డాక్యుమెంట్ల ప్రకారం యాప్‌లో ప్రతి కాలమ్ సరిగ్గా పూరించాలని అధికారులకు సూచించారు.

100శాతం ఇండ్ల పన్నుల వసూళ్లు చేయాలి

అనంతరం గంగారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలలో ఇండ్ల పన్నుల వసూళ్ల 100శాతం నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, వసూలైన నగదును వెంటనే జీపీ ఖాతాలలో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. క్యాష్ బుక్స్ రికార్డులను ఖచ్చితంగా నిర్వహిస్తూ ప్రజా అవసరాలు, పారిశుధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. నర్సరీలలో బ్యాగ్ ఫిలింగ్‌లు త్వరగా పూర్తిచేసి గ్రామస్థులు కోరిన మొక్కలను నర్సరీలలో పెంచాలని, బతికిన మొక్కల వివరాలను రిజిస్టర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవో ఆర్‌సీహెచ్. నాగేశ్వరరావు, ఎంపీవో కృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మమత

వైరా, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. హార్ట్‌ఫుల్నెస్ ట్రెయినీ మమత అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవో ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

శనిత్రయోదశి పూజలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కారేపల్లి, డిసుంబరు28:(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవిఘ్నేశ్వర విశ్వేశ్వర సీతారామాంజనేయ శివాలయంలో శనివారం ఘనంగా శని త్రయోదశి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో భక్తులు నవగ్రహ, శనీశ్వర పూజలు చేశారు. అనంతరం నవగ్రహ శనీశ్వరశాంతి హోమం నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి పంచామృతంతో అభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వరశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమవిందు కార్యక్రమం



కేక్ కట్‌చేస్తున్న తహసీల్దార్ ప్రతాప్

పెనుబల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల క్రైస్తవ కుటుంబాలకు శనివారం ప్రభుత్వ ఆధ్వర్యంలో బీరెల్లి వరప్రసాద్ చర్చిలో ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ గంటా ప్రతాప్ విందు కోసం ప్రభుత్వం తరపున రూ.37వేలు అందించారు. కార్యక్రమంలో పాస్టర్ బీరెల్లి వరప్రసాద్, ఎన్‌సీసీ కమిటీ అధ్యక్షుడు పాస్టర్ కె.దేవదానం, ఏబీసీసీ అధ్యక్షుడు డేవిడ్‌పాల్, టీసీసీ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు, ప్రతాప్‌కుమార్, పేతేరు, విజయ్, చాట్ల నాగేశ్వరరావు, మద్దెల వేణుపాల్, కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మేకతొట్టి కాంతయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న పాస్టర్ సైమన్

ఎర్రుపాలెం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో గల కారుణ్య ప్రార్థన మందిరంలో కారుణ్య చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు శనివారం నిత్యావసరాలు అందించారు. ట్రస్టు నిర్వాహకుడు పాస్టర్ సైమన్ సుమారు రూ.10వేల విలువ చేసే నిత్యావసర సరుకులను 20మంది పేద వృద్ధులకు అందించారు. ఈసందర్భంగా సైమన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈకార్యక్రమంలో సేవకురాలు రేచల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు ఇన్వర్టర్ వితరణ

ఏన్కూరు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): కేసుపల్లి గ్రామానికి చెందిన ఖమ్మం పట్టణ వైద్యులు శెట్టిపల్లి నాగేశ్వరరావు, శైలజ దంపతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.20వేల విలువైన ఇన్వర్టర్‌ను శనివారం వితరణగా అందించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం మాట్లాడుతూ నారాయణ, బసవమ్మ చారిట్రబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్నసేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుందర్‌రావు, కృష్ణప్రసాద్, బాబులాల్, ఐవీ రావు, విజయలక్ష్మి, రమాదేవి, రాజన్న, కిషోర్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఇన్వర్టర్ అందిస్తున్న శెట్టిపల్లి నాగేశ్వరరావు, శైలజ దంపతులు

మానవ హక్కుల సమస్యలపై సహకరిస్తాం

» ఆర్డీవో రాజేంద్రగౌడ్



ఆర్డీవోను సన్మానిస్తున్న రాజన్న

కల్లూరు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి సహకరిస్తామని కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్ అన్నారు. ఆల్‌ఇండియా హ్యూమన్ రైట్స్ జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడు కటుకూరి రత్నతారక రాజన్న, ఖమ్మం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వినుకొండ శ్రీనువాస్‌లు మార్యదపూర్వకంగా ఆర్డీవోతో పాటు తహసీల్దార్ సాంబశివుడులను కలిశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. సమాజంలో మానవ హక్కుల పరిరక్షణలో తమ వంతుగా కీలక పాత్ర పోషిస్తామన్నారు. పలు సమస్యలపై వారికి వివరించగా వారు కూడా సహకరిస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐహెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలపర్చండి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సీపీఎం ప్రజా ఉద్యమాలను అన్నివర్గాల ప్రజలు బలపర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన శనివారం బోడేపూడి వెంకటేశ్వర్‌రావు భవన్‌లో జరిగిన సీపీఎం వైరా డివిజన్ కమిటీ సమావేశంలో నున్నా మాట్లాడారు. వైరా నియోజకవర్గ పరిధిలో పోడు రైతులు, కార్మికులు, మహిళలు, అన్నివర్గాల ప్రజల పక్షాన సీపీఎం పోరాడుతుందని తెలిపారు. భవిష్యత్ ఉద్యమాలు, పోరాటాల కోసం అన్నివర్గాల ప్రజలు సీపీఎంను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు.జనవరి మూడోవారంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, దొంతెబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, కె.నరేంద్ర, బాణాల శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల ఇరుముడులు

కారేపల్లి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగురాళ్లబోడు గ్రామంలో జరిగిన అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సమ్మక్క ఆలయం వద్ద ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడుల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, తొగరశ్రీను, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణకు డాక్టరేట్



మురళీకృష్ణను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పంతంగి మురళీకృష్ణకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శనివారం డాక్టరేట్ అందుకున్న ఆయనను కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డైరెక్టర్ డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రతో వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కాగా ఈనెల 24వ తేదీన ఆయన ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్, ఎమర్జింగ్ అవార్డు కౌన్సిల్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గోవా హైకోర్టు జడ్జి డాక్టర్ నయోనార టేల్బాడ్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

కోర్టు తీర్పు వక్రీకరణపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న టీజీఏఎల్‌పి అసోసియేషన్ నాయకులు

వైరా, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ కోరారు. అధికారులను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు జె.సైదులురెడ్డి(స్కూల్ అసిస్టెంట్ హిందీ, యాదాద్రి భువనగిరి జిల్లా) వేముల శేఖర్(జూనియర్ లెక్చరర్ జూనియర్ కళాశాల జనగామ కో ఎడ్యుకేషన్)లపై శనివారం హైకోర్టు న్యాయవాది కె.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్‌కు ఫిర్యాదు సమర్పించారు. ఆ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండా వినోద్‌బాబు, గుమ్మడి మల్లయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కంచర్ల శ్రీకాంత్, వెంకటముత్యం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచ అలంకారం

ఎర్రుపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచ అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా అయ్యప్పస్వామిపడి పూజ

శ్రీవారి ఆలయ ఆవరణలో ఉప ఆలయమైన అయ్యప్పస్వామి ఆలయంలో కాసులనాటి రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో 18మెట్లకు పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. చిన్నిస్వామి భజనపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్ రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బా ప్రసాద్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పభజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈవో జగన్మోహన్‌రావు

మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు 200 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేటాయించిన స్థలాన్ని శనివారం తహసీల్దార్ పున్నం చందర్ ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారు. మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ జేఈ శ్రీకాంత్ స్థలాన్ని పరిశీలించారు. నూతనంగా గృహ నిర్మాణశాఖ తిరిగి కార్యకాలపాలను నిర్వహించనున్నందున మోడల్ ఇందిరమ్మ ఇంటిలో కార్యాలయం పనులు ప్రారంభం కానున్నాయి.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

» తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్

తిరుమలాయపాలెం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్య వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని తెట్టెలపాడులో ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగంలో పేర్కొన్న 29 అంశాలను పంచాయతీలకు బదిలీచేయాలన్నారు. పంచాయతీలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధులు, విధులు అధికారాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా వాటిని ఇతర ప్రాధాన్యత కార్యక్రమాలకు మళ్లిస్తూ స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బకాయిలన్నీ రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేయాలని కోరారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల గురించి సీఎం రేవంత్‌రెడ్డి ఆయాశాఖ మం త్రుల దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుసులూరి మంజుల, తుపాకుల నాగేశ్వరరావు, పుసులూరి పుల్లయ్య, పాల్గొన్నారు

పేకాట స్థావరంపై దాడి

» ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.7,300 నగదు స్వాధీనం

కల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గల బత్తుపల్లి గామంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై శనివారం ఎస్ఐ నివేదిత తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సంఘటనలో ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.7,300 నగదును స్వాధీన పరుచుకున్నారు. నిందితుల్లో ఎనిమిది మంది పరారయ్యారు. ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వివరించారు. వారంతా కల్లూరు మండలానికి చెందిన వారని తెలసింది. ఈ మేరకు ఎస్ఐ నివేదిత నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.